రిశిత మళ్లీ మెరిసె

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ బసిరెడ్డి రిశితారెడ్డి అంతర్జాతీయ వేదికపై మళ్లీ మెరిసింది. సింగపూర్‌లో జరిగిన రాడ్‌లేవర్ కప్ జూనియర్ ఆసియా/ఓషియానా రిజినల్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత్ తరపున రిశిత పోటీకి దిగింది. ఈ టోర్నీలో భారత్, సింగపూర్, జపాన్ టీమ్‌లు బరిలో నిలిచాయి. గురువారం జరిగిన బాలికల సింగిల్స్ పోరులో రిశిత 6-1, 6-3తో మియు తకిగుచి(జపాన్)తో గెలువగా, అదే జోరులో సింగపూర్‌కు చెందిన జాయ్ షాని యాపై 6-1, 6-2తో చిత్తు చేసింది టైటిల్ విజేతగా నిలిచింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ లాన్ టెన్నిస్(ఐటీ)..భారత్ నుంచి ఇద్దరు బాలురు, బాలికలను ఎంపిక చేయగా, ఇందులో రిశిత చోటు దక్కించుకుంది. వచ్చే ఏడాది స్పెయిన్‌లో జరిగే అంతర్జాతీయ టోర్నీలో ఈ యువ ప్లేయర్ పోటీపడనుంది.

హైబ్రిడ్ మోడల్‌లోనే..

చాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధతకు తెర • తటస్థ వేదికపై ఆడనున్న భారత్ • 2028 వరకు ఇదే ఫార్ములా కొనసాగింపు

దుబాయ్: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై ఎట్టకేలకు సందిగ్ధత వీడింది. గత కొన్ని రోజులుగా సాగుతున్న చర్చలకు ఫుల్‌స్టాప్ పడింది. భద్రతా కారణాల రీత్యా తాము పాకిస్థాన్‌లో పర్యటించలేమన్న భారత్ ప్రతిపాదనకు మొగ్గుచూపిన ఐసీసీ..తటస్థ వేదికపై మ్యాచ్‌లు నిర్వహించేందుకు హైబ్రిడ్ మోడల్‌కు ఓకే చెప్పింది. చివరి వరకు హైబ్రిడ్ విధానానికి ససేమిరా అన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) దిగొచ్చి ఐసీసీ ప్రతిపాదనకు అంగీకరించాల్సి వచ్చింది. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్య హోదాలో పాక్‌తో పాటు యూఏఈలో భారత్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ మేరకు ఐసీసీ, పీసీబీ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సఫలీకృతమయ్యాయి. అయితే ఓవైపు హైబ్రిడ్ మోడల్‌కు ఓకే చెప్పిన పీసీబీ..2024 నుంచి 2027 వరకు జరిగే టోర్నీల్లో తాము కూడా భారత్‌లో పర్యటించమంటూ స్పష్టం చేయడంతో తటస్థ వేదికలపై నిర్వహణకు బీసీసీఐ ఒప్పుకుంది. దీంతో వచ్చే ఏడాది భారత్‌లో జరిగే మహిళల వన్డే ప్రపంచకప్‌తో పాటు 2026లో జరిగే టీ20 వరల్డ్‌కప్ కోసం పాక్ జట్టు భారత్‌లో కాకుండా వేరే దేశంలో మ్యాచ్‌లు ఆడుతుంది. 2028లో పాకిస్థాన్‌లో జరిగే మహిళల టీ20 ప్రపంచకప్ వరకు ఈ ఒప్పందాన్ని కొనసాగించనున్నారు. బార్క్‌లే స్థానంలో కొత్తగా చైర్మన్ బాధ్యతలు అందుకున్న జై షా నేతృత్వంలో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా ఒప్పందం జరుగడం విశేషం. టోర్నీకి సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని ఐసీసీ పేర్కొంది.

సౌత్‌వెస్ట్‌జోన్ టోర్నీకి రోహన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే సౌత్‌వెస్ట్ జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌నకు రాష్ట్రానికి చెందిన యువ స్విమ్మర్ రోహన్‌రెడ్డి ఎంపికయ్యాడు. మూడు రోజుల పాటు జరిగే టోర్నీలో రోహన్..50మీటర్ల ఫ్రీస్టయిల్, 50మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 100మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాల్లో అనురాగ్ యూనివర్సిటీ తరపున బరిలోకి దిగనున్నాడు.

తెలంగాణ ఉత్కంఠ గెలుపు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సరూర్‌నగర్ స్టేడియం వేదికగా జరుగుతున్న 49వ జాతీయ సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ సత్తాచాటింది. గురువారం జరిగిన పోరులో రాష్ట్ర బాలికల టీమ్ 53-52తో చండీగఢ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తెలంగాణ తరపున మైత్రి (20), చైత్ర (17), ఆరాధ్య (8) ఆకట్టుకున్నారు. చండీగఢ్ జట్టులో స్మృయ(24), జియా(18) రాణించారు.

త్రిష విజృంభణ

బంగ్లాపై యువ భారత్ విజయం

అండర్-19 ఆసియా కప్ టోర్నీ

కౌలాలంపూర్: మహిళల అండర్-19 ఆసియాకప్ టోర్నీలో యువ భారత్ గెలుపు జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత అండర్-19 టీమ్ 8 వికెట్ల తేడాతో బంగ్లాపై ఘన విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 81 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 2 వికెట్లు కోల్పోయి 12.1 ఓవర్లలో 86 పరుగులు చేసింది. ఓపెనర్ గొంగడి త్రిష(46 బంతుల్లో 58 నాటౌట్, 10ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కగా, కెప్టెన్ నికీ ప్రసాద్(22 నాటౌట్) ఆకట్టుకుంది. 10 పరుగులకే ఓపెనర్ కమలిని(0) వికెట్ కోల్పోయిన భారత్‌ను తెలంగాణ డాషింగ్ బ్యాటర్ త్రిష ఆదుకుంది. బంగ్లా బౌలర్లను దంచికొడుతూ తన ఇన్నింగ్స్‌లో 10ఫోర్లతో చెలరేగింది. తొలి మ్యాచ్‌లో విఫలమైన త్రిష మలి మ్యాచ్‌లో సత్తాచాటి జట్టు విజయంలో కీలకమైంది. అనీసా అక్తర్(2/19) రెండు వికెట్లు తీసింది. తొలుత నిర్ణీత 20 ఓవర్లలో బంగ్లా టీమ్ 80/8 స్కోరుకు పరిమితమైంది. ఆయూశి శుక్లా(3/9), సోనమ్‌యాదవ్(2/6) ధాటికి బంగ్లా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. మొస్సామత్(11) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు దారుణంగా విఫలమయ్యారు.

అమ్మాయిలు అదుర్స్

మందన, రీచా, రాధా విజృంభణ • వెస్టిండీస్‌పై ఆఖరి టీ20లో ఘన విజయం • 2-1తో సిరీస్ భారత్ సొంతం

1 అంతర్జాతీయ టీ20ల్లో భారత్‌కు ఇది అత్యుత్తమ స్కోరు(217/4)

3 టీ20ల్లో వేగవంతమైన(18 బంతుల్లో) అర్ధసెంచరీ చేసిన మూడో బ్యాటర్‌గా రీచా నిలిచింది. సోఫీ డివైన్, లిచ్‌ఫీల్డ్ ముందున్నారు.

ముంబై: వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత మహిళల జట్టు 2-1తో సొంతం చేసుకుంది. గురువారం జరిగిన మూడో టీ20లో టీమ్‌ఇండియా 60 పరుగుల తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. 2019 తర్వాత సొంత ఇలాఖాలో టీమ్‌ఇండియాకు ఇదే తొలి టీ20 సిరీస్ కావడం విశేషం. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్..నిర్ణీత 20 ఓవర్లలో 217/4 రికార్డు స్కోరు చేసింది. ఓపెనర్, కెప్టెన్ మందన(47 బంతుల్లో 77, 13ఫోర్లు, సిక్స్)కు తోడు రీచా ఘోష్(21 బంతుల్లో 54, 3ఫోర్లు, 5సిక్స్‌లు) రికార్డు అర్ధసెంచరీతో విజృంభించారు. మందన సూపర్‌ఫామ్‌తో మెరుగైన ఆరంభం అందించగా, రీచా ఆకాశమే హద్దుగా చెలరేగింది. హెన్రీ, డాటిన్, అలైన్, ఫ్లెచర్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన విండీస్..20 ఓవర్లలో 157/9 స్కోరుకు పరిమితమైంది. రాధా యాదవ్ (4/29) ధాటికి హెన్రీ(43) మినహా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. రీచాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మందనకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కింది. ఇరు జట్ల మధ్య వడోదరాలో ఈనెల 22 నుంచి వన్డే సిరీస్ మొదలుకానుంది.

మందన, రీచా మెరుపులు:

భారత బ్యాటర్లు మందన, రీచా ఘోష్ మెరుపులు మెరిపించారు. ఒక పరుగుకే ఓపెనర్ ఉమ్రా ఛెత్రీ(0) వికెట్ కోల్పోయిన భారత్‌ను మందన గాడిలో పడేసింది. సిరీస్‌లో సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ రోడ్రిగ్స్(39)తో కలిసి విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. తన ఇన్నింగ్స్‌లో 13ఫోర్లు, భారీ సిక్స్‌తో అలరించిన మందన..ఈ సిరీస్‌లో హ్యాట్రిక్ అర్ధసెంచరీని ఖాతాలో వేసుకుంది. రోడ్రిగ్స్ ఔట్‌తో రెండో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రాగ్వి బిస్ట్(31 నాటౌట్)తో ఇన్నింగ్స్ కొనసాగించిన మందన 77 పరుగుల వద్ద డాటిన్‌కు వికెట్ ఇచ్చుకుంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన రీచా..విండీస్‌కు చుక్కలు చూపెట్టింది. బంతి దొరికితే బౌండరీనే అన్న లక్ష్యంగా చెలరేగింది. 5సిక్స్‌లకు తోడు మూడు ఫోర్లతో 18 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకుంది. రీచా ధనాధన్ ఇన్నింగ్స్‌తో భారత్ టీ20ల్లో రికార్డు స్కోరు అందుకుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 217/4(మందన 77, రీచా ఘోష్ 54, హెన్రీ 1/14, ఫ్లెచర్ 1/24), **వెస్టిండీస్:** 20 ఓవర్లలో 157/9(హెన్రీ 43, డాటిన్ 25, రాధాయాదవ్ 4/29, రేణుక 1/16)

హెచ్ఎఫ్‌సీ కోచ్‌పై వేటు

హైదరాబాద్: హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్(హెచ్ఎఫ్‌సీ) చీఫ్ కోచ్ తాంగ్బోయి సింగ్టోపై వేటు పడింది. ఐఎస్ఎల్ ప్రస్తుత సీజన్‌లో హెచ్ఎఫ్‌సీ పేలవ ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటూ టీమ్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దాదాపు ఐదేండ్లకు పైగా హెచ్ఎఫ్‌సీతో కొనసాగుతున్న సింగ్టోను గతేడాది హెడ్‌కోచ్‌గా నియమించింది. నిరుటి సీజన్‌తో పాటు ప్రస్తుత సీజన్‌లో జట్టు ప్రదర్శన దారుణంగా తయారైంది. హెచ్ఎఫ్‌సీ 11 మ్యాచ్‌ల్లో రెండు విజయాలు ఒక డ్రాతో 12వ స్థానంలో కొనసాగుతున్నది. సింగ్టో స్థానంలో శమీల్ చెంబాకత్ తాత్కాలిక కోచ్‌గా వ్యవహరిస్తాడని హెచ్ఎఫ్‌సీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మణిపూర్‌కు చెందిన సింగ్టో గతంలో నార్త్‌ఈస్ట్ యునైటెడ్, కేరళ బ్లాస్టర్స్ సహాయక కోచ్‌గా వ్యవహరించాడు.

అవమానం వల్లే వీడ్కోలు

అశ్విన్ తండ్రి మాటలు వివాదాస్పదం • దిద్దుబాటుకు దిగిన స్పిన్నర్

చెన్నై: భారత దిగ్గజ స్పిన్నర్ అశ్విన్ అనూహ్య రిటైర్మెంట్‌పై వివాదం నెలకొన్నది. గబ్బా టెస్టు ముగిసిన వెంటనే తన సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్ క్లబ్ క్రికెట్‌లో కొనసాగుతానని ప్రకటించాడు. అయితే అవమానాల వలే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాల్సి వచ్చిందని అతని తండ్రి రవిచంద్రన్ పేర్కొన్నాడు. మీడియాతో మాట్లాడుతూ 'అశ్విన్..వీడ్కోలు పలుకుతున్న విషయం నాకు ఆఖరి నిమిషంలో తెలిసింది అతని రిటైర్మెంట్ వెనుక చాలా కారణాలు ఉండే ఉంటాయి. అవమానాలు వల్లే అతను ఈ నిర్ణయానికి వచ్చి ఉండచ్చు. ఎవరైనా ఎన్ని రోజులు అవమానాలు ఎదుర్కొంటారు' అని అన్నాడు. ఇది ఆ నోటా..ఈ నోటా అన్నట్లు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో అశ్విన్ దిద్దుబాటు చర్యలకు దిగాడు. 'నా తండ్రికి మీడియాతో ఎలా మాట్లాడాలో తెలియదు. అతని మాటాలను మీరు సీరియస్‌గా తీసుకోకండి. తండ్రుల మాటాలను మీడియా పరిగణనలోకి తీసుకుంటుందని అసలు ఊహించలేదు. జరిగిన తప్పిదాన్ని మన్నించి అతన్ని ఒంటరిగా వదిలేయండి' అంటూ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. ఇదిలా ఉంటే గబ్బా టెస్టు ముగిసిన తర్వాత స్వదేశానికి బయల్దేరిన అశ్విన్..గురువారం ఉదయం చెన్నైకి చేరుకున్నాడు. ఇంటి దగ్గర భారీ సంఖ్యలో అభిమానులు అశ్విన్‌కు స్వాగతం పలికారు.

వాణిజ్య

డాలర్=రూ.85.13

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి మారకం విలువ • ఒక్కరోజే 19 పైసలు దిగజారిన దేశీయ కరెన్సీ

గడిచిన 3 రోజుల్లో 33 పైసలు పతనం • మారిన ఫెడ్ రిజర్వ్ ద్రవ్య వైఖరితో డాలర్ ర్యాలీ

భారతీయ దిగుమతులపై పెరగనున్న భారం • ఆర్థిక వ్యవస్థకూ తప్పని ఇబ్బందులు



రూపాయి మారకం విలువ 85 మార్కును దాటేసింది.

ఒక్క డాలర్‌కు బదులుగా 85.13 రూపాయలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా కరెన్సీ ముందు ఏమాత్రం నిలదొక్కుకోలేక నీరసించిపోతున్న భారతీయ కరెన్సీ కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం ముంచుకొస్తున్న దిప్పుడు.

83 నుంచి 84కు రూపీ విలువ దిగజారేందుకు పట్టిన సమయం 14 నెలలు

10 నెలల్లో 82 నుంచి 83కు పడిపోయిన రూపాయి మారకం విలువ

కేవలం రెండు నెలల్లోనే 84 నుంచి 85కు క్షీణత

ముంబై, డిసెంబర్ 19: డాలర్ ధాటికి రూపాయి కుప్పకూలింది. గురువారం కీలకమైన 85 మార్కు దిగువకు పడిపోయింది. చారిత్రక కనిష్ఠ స్థాయిని తాకుతూ తొలిసారి 85.13 వద్దకు మారకపు విలువ చేరింది. ఈ ఒక్కరోజే డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ ఏకంగా 19 పైసలు క్షీణించడం గమనార్హం. దీంతో ఈ వారం మొత్తంగా మూడు రోజుల్లో 33 పైసలు నష్టపోయినట్లైంది. సోమవారం 11 పైసలు కోల్పోయిన విషయం తెలిసిందే. కాగా, ఉదయమే ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద రూపాయి 85.14 వద్ద మొదలైంది. చివరకు కాస్త కోలుకుని 85.13 వద్ద ముగిసింది.

డాలర్ ర్యాలీ

అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ బుధవారం నిర్వహించిన ద్రవ్యసమీక్షలో పావు శాతం వడ్డీరేట్లను తగ్గించింది. అయితే ఈ సందర్భంగా వచ్చే ఏడాది రెండుసార్లు మాత్రమే వడ్డీరేట్ల తగ్గింపులుండొచ్చని ప్రకటించింది. గతంలో నాలుగుసార్లు తగ్గిస్తామని చెప్పగా.. దాన్నిప్పుడు సగానికి కుదించేసింది. దీంతో ఫెడ్ రిజర్వ్ కఠిన ద్రవ్య వైఖరికి వెళ్తుందన్న సంకేతాలు మార్కెట్‌కు స్పష్టంగా వెళ్లాయి. ఫలితంగా డాలర్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఇది భారతీయ రూపీపై సహజంగానే ప్రభావం చూపిందని ఫారెక్స్ ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు.

జీడీపీకి దెబ్బ

డాలర్ ముందు అంతకంతకూ బలహీనపడుతున్న రూపాయి.. భారత ఆర్థిక వ్యవస్థను గట్టిగానే దెబ్బతీస్తున్నది. ఇప్పటికే మునుపెన్నడూ లేనివిధంగా గత రెండు నెలలుగా క్షీణిస్తూపోతున్న రూపీ.. తాజాగా 85 మార్కును దాటేసింది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే మరింతగా నష్టపోవచ్చన్న అంచనాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే భారత్‌కు విదేశాల నుంచి వచ్చే దిగుమతులు ఇంకా ఖరీదెక్కడం ఖాయమే. దీనివల్ల ద్రవ్యోల్బణం మరింత విజృంభించగలదు. ఫలితంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్లను ఇప్పటికే ఉన్న గరిష్ఠ స్థాయిల్లోనో లేక ఇంకా ఎక్కువకో చేర్చడానికి వీలున్నది. దాదాపు రెండేండ్లుగా రెపోరేటును 6.5 శాతం వద్దే ఆర్బీఐ ఉంచుతున్న సంగతి విదితమే. దీంతో ఇదే స్థాయిలోనో లేక పెరిగితే గనుక కీలక రంగాల్లో వృద్ధిరేటు దారుణంగా పడిపోవచ్చన్న ఆందోళనలు వ్యాపార, పారిశ్రామిక రంగాల నుంచి వ్యక్తమవుతున్నాయి. సామాన్యులు, ఇతర రుణగ్రహీతలపై ఈఎంఐల భారం కూడా తీవ్రమయ్యే ప్రమాదం ఉందని బ్యాంకింగ్ వర్గాలూ హెచ్చరిస్తున్నాయి.

ఆర్బీఐ చర్యలతో..

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాలకు పతనమైన క్రమంలో ఆర్బీఐ జోక్యం చేసుకుంటే పరిస్థితులు కుదుటపడవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. డాలర్లు మార్కెట్‌లోకి పెద్ద మొత్తంలో విడుదలైతే రూపాయి తిరిగి కోలుకుంటుందని అంటున్నారు. అయితే దేశంలో గతకొద్దిరోజులుగా డాలర్ నిల్వలు పడిపోతుండటం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో దేశీయంగా డాలర్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కానీ 2 నెలల్లోనే సుమారు 30 బిలియన్ డాలర్లు కరిగిపోయాయి మరి.

గడిచిన పదేండ్లలో రూపాయి తీరుతెన్నులు

Year	USD vs INR
2014	₹59.18
2015	₹63.75
2016	₹67.19
2017	₹64.05
2018	₹67.42
2019	₹69.57
2020	₹75.50
2021	₹72.51
2022	₹77.57
2023	₹82.68
2024	₹85.13

రూపీ క్షీణతకు కారణాలు

- వచ్చే ఏడాది వడ్డీరేట్ల కోతల్ని ఫెడ్ రిజర్వ్ కుదించడం
- కరెన్సీ మార్కెట్‌లో డాలర్లకు పెరిగిన డిమాండ్
- డాలర్ల కొనుగోలుకు ఎగబడిన భారతీయ దిగుమతిదారులు
- దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాలు
- పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్న విదేశీ మదుపరులు

మార్కెట్లోకి కియా సైరోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా..మరో ఎస్‌యూవీ సైరోస్ మాడల్‌ను పరిచయం చేసింది. నాలుగు మీటర్ల లోపు పొడువు కలిగిన ఈ మాడల్ కంపెనీ నుంచి విడుదలైన మూడో ఎస్‌యూవీ మాడల్ ఇదే కావడం విశేషం. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ మాడల్‌లో ఆరు-స్పీడ్ మాన్యువల్, 7 స్పీడ్ డీసీటీ గేర్‌తో తీర్చిదిద్దింది. అలాగే 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్ కలిగిన మాడల్‌లో ఆరు స్పీడ్ మాన్యువల్ ఉన్నాయి. అడ్వాన్స్ ఫీచర్స్‌తో తయారైన ఈ మాడల్‌లో 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, నాలుగు డిస్క్ బ్రేక్‌లతో ఏబీఎస్, ముందు-వెనుక పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ కారు ధర సంస్థ ప్రకటించకపోయినప్పటికీ ధర మాత్రం రూ.12 లక్షల నుంచి రూ.22 లక్షల లోపు ఉంటుందని అంచనా.

బీడీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా గాయత్రీ ప్రసాద్

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) డైరెక్టర్(ఫైనాన్స్)గా జీ గాయత్రీప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బీడీఎల్‌లోనే జనరల్ మేనేజర్(ఫైనాన్స్)గా పనిచేసిన ఆయన.. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ చదివారు. 1997లో బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన ఆయన..27 ఏండ్లపాటు అకౌంటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, టాక్సేషన్ విభాగాల్లో విధులు నిర్వర్తించారు.

స్టాప్ క్రాఫ్ట్‌తో ఐకియా జట్టు

బెంగళూరు, డిసెంబర్ 19: వంట సామాగ్రీ, గృహోపకరణాల తయారీలో ప్రముఖ బ్రాండ్ స్టాప్ క్రాఫ్ట్ లిమిటెడ్‌తో ప్రపంచ రిటైల్ దిగ్గజం ఐకియా జట్టు కట్టింది. స్టాప్ క్రాఫ్ట్‌ను తమ గ్లోబల్ సప్లై భాగస్వామిగా ఐకియా ఎంచుకున్నది. దీంతో 2026 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐకియా స్టోర్లలో స్టాప్ క్రాఫ్ట్ ఎక్స్‌క్లూజివ్‌గా ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను విక్రయించనున్నది. ఇందుకోసం కర్ణాటకలోని హరోహల్లిలో 1.80 లక్షల చదరపు అడుగుల్లో ఓ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను కూడా తేబోతున్నది. కాగా, పిజియన్, గిల్మా, బ్లాక్ ప్లస్ డెకార్, పిజియన్ ఎల్ఈడీ బ్రాండ్లు స్టాప్ క్రాఫ్ట్‌కు చెందినవే.

ఎయిర్‌టెల్ స్పెక్ట్రం బాకీ చెల్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: భారతీ ఎయిర్‌టెల్..స్పెక్ట్రానికి సంబంధించి టెలికం మంత్రిత్వ శాఖకు ఉన్న రూ.3,626 కోట్ల బకాయిలను పూర్తిగా చెల్లించింది. 2016లో స్పెక్ట్రం కేటాయింపునకు సంబంధించి ఈ బకాయితోపాటు 8.65 శాతం వార్షిక వడ్డీతో చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వెల్లడించింది.

79 వేల దిగువకు పుత్తడి

మరో రూ.1,000 వరకు తగ్గిన తులం ధర

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: బంగారం ధరలు శాంతించాయి. ఆభరణాల వర్తకులు, అంతర్జాతీయంగా డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు దిగొచ్చాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.79 వేల దిగువకు రూ.78,300కి పడిపోయింది. అంతకుముందు ఇది రూ.79,100 గా ఉన్నది. అమెరికా ఫెడ్ రిజర్వ్ కఠిన ద్రవ్య వైఖరే ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. కిలో వెండి ఏకంగా రూ. 2,000 తగ్గి రూ.90 వేలుగా నమోదైంది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.710 తగ్గి రూ.77,130కి దిగిరాగా, 22 క్యారెట్ ధర రూ.650 తగ్గి రూ.70,700కి తగ్గింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,634 డాలర్లకు, వెండి 29.90 డాలర్లకు తగ్గాయి.

జియో సరికొత్త ప్లాన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో..ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి సరికొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే టారిఫ్ చార్జీలు పెంచి వినియోగదారులకు షాకిచ్చిన జియో..ఈసారి మాత్రం చౌకైన ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. 98 రోజుల కాలపరిమితితో రూ.999 ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ కాల్స్‌తోపాటు రోజుకు 2 జీబీ డాటా చొప్పున 196 జీబీల డాటాను పొందవచ్చును. ఈ డాటా అయిపోయిన తర్వాత ఇంటర్నెట్ స్పీడ్ 64 కేబీపీఎస్‌కి పడిపోనున్నది. ప్రస్తుతం సంస్థకు 49 కోట్ల మంది మొబైల్ కస్టమర్లు ఉన్నారు.

మార్కెట్లో ఫెడ్ ప్రకంపనలు

సెన్సెక్స్ 965, నిఫ్టీ 247 పాయింట్ల పతనం

ముంబై, డిసెంబర్ 19: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతోపాటు వచ్చే ఏడాది రేట్లను ఆశించిన స్థాయిలో కోత ఉండకపోవచ్చన్న సంకేతాలు ఇవ్వడం మదుపరుల్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా నష్టాల బటన్ నొక్కిన మదుపరులు చివరి వరకు ఇదే పంతాను కొనసాగించడంతో రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్, బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లు భారీ నష్టాల్లో కూరుకుపోవడంతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడంతో సెన్సెక్స్ 80 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. ఇంట్రాడేలో 1,100 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 964.15 పాయింట్లు లేదా 1.20 శాతం నష్టపోయి 79,218.05 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ 247.15 పాయింట్లు లేదా 1.02 శాతం నష్టపోయి 24 వేల పాయింట్ల దిగువకు 23,951.70 వద్దకు జారుకున్నది. గత నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 2,915.07 పాయింట్లు లేదా 3.54 శాతం, నిఫ్టీ 816.60 పాయింట్లు లేదా 3.29 శాతం నష్టపోయింది.

10 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గత నాలుగు రోజులుగా సూచీలు నష్టాల్లో ట్రేడవడంతో మదుపరులు రూ.10 లక్షల కోట్ల వరకు సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.9,65,935.96 కోట్లు కరిగిపోయి రూ.4,49,76,402.63 కోట్లు (5.29 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది.

- ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీగా